
ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న సుభాష్‌నగర్ ఆటో అసోసియేషన్ సభ్యులు


కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేకానంద్‌కు కలిసిన పద్మశాలి సంఘం సభ్యులు


ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన సూరారం కాలనీ మహిళా కాంగ్రెస్ నాయకులు


ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతు తెలుపుతున్న రజక సంఘం నాయకులు

అన్ని వర్గాల అభ్యున్నతే బీఆర్‌ఎస్ ధ్యేయం

• కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్: అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి పాటు పడుతున్న ఏకైన పార్టీ బీఆర్‌ఎస్ అని, మూడోసారి ప్రజలు ఆశీర్వదించి తమ ప్రభుత్వానికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం మున్సిపల్ మాజీ చైర్మన్ జయరామ్, పద్మశాలి సంఘం కన్వీనర్ గోపాల్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలియజేశారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. సీఎం కేసీఆర్ నేతన్నల సంక్షేమానికి రూ.7వేల కోట్ల బడ్జెట్ రూ.5 లక్షల బీమా కల్పించారన్నారు. పద్మశాలి సంఘం కో- కన్వీనర్ శంకరయ్య, మురళి, హరి నారాయణ, జనార్దన్, పెద్ది మల్లేశం, పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, గట్టు అశోక్, అనీత ఆధ్వర్యంలో సూరారం కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకులు రాణి,లక్ష్మి,శశికళ లు తమ అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే వివేకానంద్ వారికి పార్టీ కండువాలు కప్పారు.

◆ సుభాష్‌నగర్ ఆటో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతూ మూడోసారి గెలిపించుకుంటామని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమానికి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, అసోసియేషన్ చైర్మన్ చంద్రశేఖర రావు, అడ్వైజర్ రాజశేఖర్ రావు, ప్రెసిడెంట్ ఎస్ రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

◆ దుండిగల్ మున్సిపాలిటీ డీపోచంపల్లిలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గుర్రాల శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. నిఖిల్ రెడ్డి, శ్రీకర్, ఉపేందర్, సాయి, అభిలాష్, మహేష్, శ్రీను, రాజు, వేణు, అంజి, నాగబాబు తదితరులు పార్టీలో చేరగా ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, జనరల్ సెక్రటరీ మల్లేష్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రవి యాదవ్, కౌన్సిలర్లు శంబీపూర్ కృష్ణ, సాయి యాదవ్, మహేందర్ యాదవ్, జక్కుల కృష్ణయాదవ్, భరత్, ఆనంద్, విష్ణు, సురేందర్ రెడ్డి, రాజశేఖర్ యాదవ్, సుదర్శన్ రెడ్డి, కొల శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

◆ సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పద్మశాలి సంఘం సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద కలిసి పద్మశాలిల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషికి కృతజ్ఞతగా ఏకగ్రీవ తీర్మానం చేసి మద్దతు తెలిపారు.

◆ కుత్బుల్లాపూర్ రజక సంఘం నాయకుడు సింగారం మల్లేష్ ఆధ్వర్యంలో రజక సంఘం ముఖ్య నాయకులు ఎమ్మెల్యే వివేకానంద అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రజకులకు దోబీఘాట్‌లు నిర్మించడంతో పాటు ఉచిత కరెంట్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు, బాలయ్య, శంకర్, వెంకటయ్య, పురుషోత్తం, సాయిబాబా, యాదగిరి, విటల్, వెంకటేష్, కృష్ణమూర్తి, సత్యనారాయణ, చంటి, నరసయ్య, చందు, శ్రీనివాస్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కృషితోనే తండాల అభివృద్ధి

● మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..
● గిరిజన బంధు తప్పకుండా వస్తది. ● రాష్ట్ర మంత్రి హరీష్‌రావు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కేసీఆర్‌కు ముందు తండాల పరిస్థితి ఏంది. ఇప్పుడు ఏంది.. ఆనాడు తాగునీళ్ల కోసం ఎంత కష్టపడ్డారో చూడండి. నారాయణఖేడ్‌లో బిందెలతో గిరిజనులు ఎన్నో పోరాటాలు చేశారు. ఆనాడు మంచం ఎక్కిన తండా.. విష జ్వరాలతో గిరిజన గూడాలు అని పేపర్లలో హెడ్డింగ్‌లు.. ఇవాళ తాగునీటి కష్టాలు లేవని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు తెలిపారు. శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తూంకుంట పుష్ప కన్వెన్షన్‌లో రాష్ట్ర స్థాయి గిరిజనుల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సమ్మేళనానికి మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన తరువాత సీఎం కేసీఆర్ అన్ని తాండలను గ్రామ పంచాయతీలు చేశారన్నారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చింది కేసీఆరే.. పట్టాలు ఒక్కటే కాదు రైతు బంధు ఇచ్చింది కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. ప్రతి గిరిజన బిడ్డ చదువుకోవాలని గిరిజన గురుకుల పాఠశాలు ఏర్పాటు చేసింది. విదేశీ విద్య పథకం పెట్టి ఎంతో మంది గిరిజన బిడ్డలకు విదేశీ విద్యను అందించింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా సీఎం కేసీఆర్ తాండలను గ్రామపంచాయతీలు చేశారని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎంపీ ప్రొ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే సత్తన్న, రాష్ట్ర గిరిజన నాయకులు రామచంద్రునాయక్, సూరయ్య, కృష్ణప్రసాద్, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం

• కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి హన్మంతరెడ్డి


కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డికి బుద్ధుడి విగ్రహాన్ని అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు


కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డికి బుద్ధుడి విగ్రహాన్ని అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు


శ్రీఎన్‌క్లేవ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్

నిజాంపేట్: బంగారు తెలంగాణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని.. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని సూరారం డివిజన్ హెచ్‌ఎండీ సొసైటీలో మాజీ కార్పొరేటర్ పాల బాలకృష్ణ ఏర్పాటు చేసిన కురుమ సంఘం సమావేశానికి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి హన్మంతరెడ్డి హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కురుమ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నిరంకుశ పాలనతో విసుగు చెందిన రాష్ట్ర ప్రజానీకం కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు.

◆ కుత్బుల్లాపూర్ కురుమ సంగం సలహాదారుడు నార్లకంటి పెంటయ్య, మాజీ అధ్యక్షుడు నార్లకంటి ప్రతాప్, నార్లకంటి దుర్గయ్య, బట్ట నర్సింహ, ఆనంద్, బి.వెంకటేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ళ సంజీవారెడ్డి, దినేష్ పివల్, మాజీ వార్డ్ మెంబర్ గణేష్, మహ్మద్ షకీల్, డివిజన్ అధ్యక్షురాలు అచ్చెమ్మ తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌కు చెందిన నర్సింహ ఆధ్వర్యంలో దావీదు, సురేష్, సాయి, ఎల్లయ్యలు, సాయినగర్‌కు చెందిన మల్లేష్, వెంకటయ్య, రాజుతో పాటు పలువురు యువకులు కొలన్ హన్మంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

◆ నిజాంపేట్ కార్పొరేషన్ 21వ డివిజన్ సాయి నగర్‌కు చెందిన శ్రీనివాస్‌చారి, అస్గర్, శ్రీను, నెల్దర్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

◆ రంగారెడ్డి మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అధ్యక్షతన జీడిమెట్ల డివిజన్ శ్రీనిలయ ఎన్‌క్లేవ్‌లో స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు. తాను అధికారంలో ఉన్నా లేకుండా ప్రజా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేపీ విశాల్‌గౌడ్, కృష్ణారెడ్డి, గోలి రమేష్, పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.


కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన సాయినగర్ వాసులు

కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న షాపూర్‌నగర్ మార్కెట్..



పండుగ.. సందడి

దీపావళి పండుగను పురస్కరించుకొని శనివారం షాపూర్‌నగర్ మార్కెట్ వినియోగదారులతో కిటకిటలాడింది. పండగకు సంబంధించిన షాపులు వెలిశాయి. ఒకరోజు ముందే పూజకు సంబంధించిన పూలు, ఆకులు, పండ్లు, మిఠాయిలు, పేర్నిలు కొనుగోలు చేశారు. – సుభాష్‌నగర్

దీపావళికి ఒకరోజు ముందే శనివారం ఇళ్లలో దొంతులతో బొమ్మల కొలువు ఏర్పాటు చేసుకున్నారు. ఇలా మూడు రోజుల పాటు ఇంట్లో ఉంచి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇలా చేయడం ద్వారా ఇంట్లో లక్ష్మి ఉట్టిపడుతుందని భక్తుల నమ్మకం. – సుభాష్‌నగర్



దొంతుల కొలువు..

వెన్నెలగడ్డలో బొమ్మల కొలువుతో లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న మహిళ

పాఠశాలలో దీపావళి వేడుకలు

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వర నగర్‌లోని బచ్పన్ పాఠశాలలో శనివారం పాఠశాల డైరెక్టర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో దీపావళి పండుగ సంబరాలు అంబరానంటాయి. చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి లక్ష్మీపూజలో పాల్గొన్నారు. అనంతరం కాకర పువ్వొత్తులు, చిచ్చుబుడ్లు కాలుస్తు సందడి చేశారు. దీపావళి పండుగ పట్ల అవగాహన కల్పించేందుకు వేడుకలు నిర్వహించినట్లు కోటిరెడ్డి తెలిపారు. ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టపాసుల దుకాణాలు.. ఏవీ రక్షణ చర్యలు?

రంగారెడ్డినగర్: దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద రక్షణ చర్యలు కరువయ్యాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని షాపూర్‌నగర్, సుచిత్ర, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ గండిమైసమ్మ తదితర ప్రాంతాల్లో భారీ సంఖ్యలో క్రాకర్స్ దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే ఏ ఒక్క దుకాణం వద్ద ఫైర్ సేఫ్టీ పరికరాలు మచ్చుకైనా కనిపించడం లేదు. అదే విధంగా దుకాణాల మధ్య ఖాళీ వదలకుండా ఒకే వరసలో ఏర్పాటు చేశారు. ఏదైనా జరుగరాని ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని పలువురు పేర్కొంటున్నారు. ఎన్నికల హడావుడిలో ఉన్న సర్కిల్, పోలీస్ యంత్రాంగం టపాసుల దుకాణాల వద్ద భద్రత విషయంపై పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


డబ్బులు కాజేసిన వారిపై కేసు

పోచారం: మహిళా సంఘం డబ్బులు కాజేసిన వారిపై పోచారం పీఎస్‌లో శనివారం కేసు నమోదైంది. పోచారం ఐటీసీ పోలీసులు, ఏపీఎం తౌర్యనాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చౌదరిగూడలోని స్త్రీనిధి మహిళ సంఘం అధ్యక్షురాలు కరుణ, సహాయకురాలు సువర్ణ స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్యలో తీసుకున్న రుణం డబ్బులు రూ.7,10,846లు వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. 2022లో నవంబర్ 6న ఆడిట్‌లో బయటపడడంతో సభ్యులు ఒత్తిడి మేరకు రూ.1,20,846లు చెల్లించి చేతులెత్తేశారు. మిగిలిన డబ్బులు చెల్లించకపోవడంతో పాటు బెదిరింపులకు పాల్పడంతో శనివారం సమాఖ్య అధ్యక్షురాలు భార్గవి, ఏపీఎం తౌర్యనాయక్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

బీజేపీ విజయం ఖాయం

• నామినేషన్ ర్యాలీ కార్యకర్తల్లో మరింత జోష్
• ప్రచారంలో బీజేపీకి విశేష స్పందన వస్తోందంటున్న నాయకులు
• పార్టీ కార్యకర్తలే కాకుండా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని వ్యాఖ్య


రావినారాయణరెడ్డినగర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు


బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్


కూన శ్రీశైలంగౌడ్‌కు ఓటేయ్యాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న బీజేపీ శ్రేణులు

కుత్బుల్లాపూర్: బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం నామినేషన్ ర్యాలీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. అంచనాలకు మించి జనం, పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరు కావడంతో కార్యకర్తల్లో జోష్ పెంచింది. ఇప్పటికే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారాన్ని ముమ్మరం చేసిన కూన శ్రీశైలంగౌడ్‌కు అడుగడుగున కార్యకర్తలు, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో మరింత ఉత్సాహంతో శుక్రవారం జరిగిన నామినేషన్ ప్రక్రియ కోలాహలంగా జరిగింది. షాపూర్ నగర్ ఉషోదయ టవర్ వరకు చిత్తరమ్మ జాతరను తలపించే విధంగా ర్యాలీ కొనసాగింది.

◆ నియోజకవర్గంలో దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలతో పాటు నిజాంపేట్ కార్పొరేషన్, జంట సర్కిళ్లు కుత్బుల్లాపూర్, గాజులరామారం ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలు బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌ను కమలం పువ్వుపై ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలు పంచుతూ ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కలుస్తున్నారు. ప్రచారంలో బీజేపీకి విశేష స్పందన వస్తోందని నాయకులు చెబుతున్నారు. ఇంటింటికి ప్రచారానికి వెళ్తుంటే 'ఈసారి మా ఓటు బీజేపీకే వేస్తాం'అని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. ఎన్నికల ముందే ఈసారి బీజేపీ విజయం ఖాయమైందని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.


కాకతీయనగర్‌లో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగ ప్రచారం చేస్తూ..


ఎన్‌ఎల్‌బీ నగర్‌లో కరపత్రాలు పంచుతున్న బీజేపీ నాయకులు


రంగారెడ్డినగర్ డివిజన్ విజయనగర్‌కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

విధులను బాధ్యతతో నిర్వర్తించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చేపట్టిన చర్యలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అబ్జర్వర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో మేడ్చల్, రంగారెడ్డి, జిల్లాల ఎన్నికల సాధారణ పరిశీలకులు, పోలీస్ జనరల్ అబ్జర్వర్లు, రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలికేరి, రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించి తుది ఓటర్ల జాబితాను వెల్లడించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం ఓటర్లు 28,19,067 కాగా, వారిలో పురుషులు14,59,629. స్త్రీలు 13,59,057, థర్డ్ జెండర్ 381 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 438 లొకేషన్స్‌లో 2,397 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వీటిలో అర్బన్ పోలింగ్ స్టేషన్లు 2,239 ఉన్నాయని పేర్కొన్నారు. రూరల్‌లో 158 పోలింగ్‌స్టేషన్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా ఐడిఓసిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అధునాతన పీటీజెడ్ కెమెరాలను ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు, పార్టీల ఎన్నికల వ్యయాన్ని లెక్కించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి అన్ని విధాలుగా పరిశీలన జరుపుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో 14 చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేసి నియోజకవర్గ కేంద్రాలకు తరలించి స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చామని, పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు.